తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## జిల్లా విపత్తు సహాయనిధికి... శ్రీసిటీ పరిశ్రమల కోటి విరాళం

- 'ఐలా'కు అంబులెన్స్ విరాళం ఇచ్చిన టీహెచ్‌కే ఇండియా

సత్యవేడు, డిసెంబరు 19 ప్రభాతవార్త: వరద సహాయ చర్యలకు మద్దతుగా శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) చర్యల్లో భాగంగా, జిల్లా విపత్తు సహాయ నిధికి కోటి రూపాయల విరాళాన్ని ఇచ్చింది. ప్రభుత్వ పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సమక్షంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విరాళం చెక్కును తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ, దాని పరిశ్రమల భాగస్వామ్య సమిష్టి కృషిని యువరాజ్ ప్రశంసించారు. ఈ నిధులు ఈ ప్రాంతంలోని వరద బాధితులకు సకాలంలో సాయం అందించడంతో పాటు వారు తిరిగి కోలుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని శుభం బన్సల్ తెలిపారు. బాధిత కుటుంబాలకు తన సంఘీ భావాన్ని తెలియజేసిన రవీంద్ర సన్నారెడ్డి, విపత్తు సహాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో శ్రీసిటీ నిబద్ధతను పునరుద్ఘటించారు. శ్రీసిటీ, వివిధ పరిశ్రమలు, సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ విరాళాన్ని సేకరించారు. ఈ నిధులు ఇటీవల వరదల్లో జిల్లాలో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు పునర్నిర్మాణం కోసం ఉపయోగించనున్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీలోని లీనియర్ మోషన్ గైడ్‌లను ఉత్పత్తి చేసే ప్రముఖ జపనీస్ పరిశ్రమ టీహెచ్‌కే ఇండియా, రూ.29 లక్షల విలువైన అంబులెన్స్‌ను శ్రీసిటీ ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ)కి విరాళంగా ఇచ్చింది. దీనిని లాంఛనంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ద్వారా ఐలాకు అందజేశారు.



విరాళ చెక్కును తిరుపతి కలెక్టర్ శుభం బన్సాల్‌కు అందజేస్తున్న దృశ్యం

### పరిశ్రమల ఏర్పాటుకు...

## త్వరితగతిగా భూములు కేటాయింపు

చిత్తూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు భూముల కేటాయింపు ప్రక్రియను త్వరితంగా కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎపిఐఐసి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించడానికి ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు భూమి కేటాయింపు ప్రక్రియను సంబంధితశాఖలు సమన్వయంతో త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎపిఐఐసి అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు ఏర్పాటు ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అధికారులు ఈ దిశగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలో 55 భారీ పరిశ్రమల ఏర్పాటుతో 18,219 మందికి ఉపాధి అవకాశాలు, 34,700 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా 1.38 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో మరో మూడు భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా వున్నామన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే అంశంపై క్షేత్ర స్థాయిలో మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే పారిశ్రామికవాడ గంగ్రాజుపల్లిలో మౌళిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఇ సర్వేలో ఇప్పటి వరకు 9,459 ఎంఎస్‌ఎంఎ యూనిట్లు సర్వే చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాల్టీల్లో సర్వే చేపట్టడం జరుగుతుందని పరిశ్రమలశాఖ ఎడి కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఎడి వెంకటరెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్ బాబీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిశ్రమలు ప్రమోషన్ కమిటీ సమావేశం

## గ్రామాన్ని విడిచి...వెళ్ళి పొమ్మంటారా!

### ఎంఎల్ఏ, కలెక్టర్‌ను నిలదీసిన మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ, జిల్లా కలెక్టర్

తొట్టంబేడు, డిసెంబర్ 19 ప్రభాతవార్త : మండలంలో రోడ్లన్నీ గుంతలమ యంగా మారాయాని ముఖ్యంగా తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం గ్రామసమీపంలో ఉన్న స్వర్ణముఖినది నుంచి రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తమను గ్రామంలో ఉండమంటారా?లేదా? మీరే చెప్పడండి లేదా ఊరు వదిలి వెళ్ళిపోతామంటూ పలువురు మహిళలు ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌లను నిలదీశారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గురువారం గుండెలిగుంట పంచాయతీ విరూపాక్షపురంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డితో పాటు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ మధుసూధన్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ రాత్రివేళల్లో ఇసుక ట్రాక్టర్లు ఇంటిముందు నుంచి ఇసుకను తరలిస్తూ అధికవేగంతో వెళ్తున్నాయని వాటిని అరికట్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రీచ్‌ల నుంచి సాయంత్రం 6గంటల వరకే ఇసుకను తరలించే ఏర్పాటు చేయాలని ఇసుక తరలించే ప్రాంతాల వద్దనే పోలీసు కాపలా ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌లు మద్యం సేవించారా? లేదా? తెలుసుకోవడం కోసం బ్రీత్‌అనలైజర్‌తో చెక్ చేయాలని 40నుంచి 50 కి.మీ స్పీడుతో మాట్లాడాలన్నారు. గ్రామంలో గోకులం షెడ్లు ఇంకా కావాలని కోరడంతో దీనిపై స్పందించిన కలెక్టర్ మంజూరు చేస్తామన్నారు. గతంలో ఉన్న ఎంఎల్ఏ అనుచరులు ఇంటి స్థలాలు కేటాయి స్తామని కొందరి వద్ద నుంచి నగదు వసూలు చేసుకుని మాయ చేశారన్నారు. సర్వే నంబర్ 50లో గుడికడు తున్నారని అయితే ఈగుడిలో కొందరికే అనుమతి అని తెలపడంతో వివాదం చోటుచేసుకుంది. అసలు గుడి నిర్మాణస్థలం ప్రభుత్వ భూమిలో కడుతున్నారని తెలుసుకున్న ఎంఎల్ఏ, కలెక్టర్‌లు గుడిలోకి ఎవరైనా వెళ్ళవచ్చన్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని వాటికి నిధులు మంజూరు చేసి కొత్తరోడ్లుకు నిధులు మంజూరు చేయాలని ఎంఎల్ఏ కలెక్టర్‌ను కోరారు. నూతనంగా కడుతున్న కట్టడాలు రెండేళ్ళలోపు నెర్రెలు బారుతు న్నాయని దీనికి ముఖ్యకారకులైన క్వాలిటీ కంట్రోల్ అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఎఎస్‌ఎంలను కేవలం ఫించన్లు అందుకోవడానికే కానీ, ఇతర పనులకు వాడవద్దని కలెక్టర్‌ను ఎంఎల్ఏ కోరారు. స్థానిక అవసరాలకోసం శ్రీకాళహస్తి పట్టణంలో కూడా ఇసుక డంపింగ్‌కు స్థలాన్ని కేటాయించినట్లయితే అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. అధికంగా తొట్టంబేడు మండలం నుంచే సుమారు 70శాతం రెవెన్యూ వివాదాలు వస్తున్నాయన్నారు. భూ కబ్జాదారులపై పిడియాక్ట్ చట్టం పెడితే 8 నుంచి 11సంవత్సరాలు జైలుశిక్ష తప్పదన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూసచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. పేదలకు ఉచిత ఇసుక పాలసీ విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రభుత్వంకు కేవలం రూ.170లు సీనరేజీ చార్జీలు వస్తాయన్నారు. ఎంఎంవాడ, వీఎంపల్లి వాసులు ఇసుకరీచ్‌ల వద్ద ఎక్కువగా ఉంటున్నట్లు తెలిసిందని వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు మంజూరుకు నిధులు కేటాయింపు చేస్తామని కలెక్టర్ తెలిపారు.గ్రామంలో తాగునీటి సమస్య ఉందని దీన్ని పదిరోజుల్లో పరిష్కరించాలని ఆర్‌డబ్యుఎస్ ఎఈ గౌరిజోష్‌ను ఆదేశించారు.అనంతరం గ్రామంలో ప్రజలు తమ తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు.కార్యక్రమంలో ఎంఎల్ఏ, కలెక్టర్‌లను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి సారథి, పంచాయతీ ఎఈ ప్రీతి, ఎఓ సురేంద్రరెడ్డి, సర్వేయర్ హరనాథ్, సర్పంచ్ పుల్లారెడ్డి, ఎంపిడిఓ సురేంద్రనాథ్, ఎపిఓ సుజాత నాయకులు మండల మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు రంగినేని చెంచయ్యనాయుడు, జయచంద్రనాయుడు, తెదేపా అధ్యక్షులు గాలిమురళీనాయుడు, మాజీ సర్పంచ్ మునిరత్నం, కన్నలి ప్రతాప్‌రెడ్డి, కొన్నలిరమేష్ పలువురు నాయకులు, అధికారులు, సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

## యువత చేతిలోనే...దేశ భవిష్యత్తు

-విజన్‌తో ముందుకెళితే అద్భుతాలు సాధ్యం
-విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి
- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

గుడుపల్లి,డిసెంబరు 19 ప్రభాతవార్త : దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ను ఆమె సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టుదలచ దృఢసంకల్పం ఉంటే విజయం మీసొంతం అవుతుం దని ఒక ప్రణాళిక ప్రకారం కష్టపడితే ఏదైనా సాధించవచ్చన్నారు. తల్లితండ్రులు పిల్లల భవిషత్ భాగుండాలని ఎంతో కష్టపడి చదివిస్తున్నారని వారి నమ్మకాన్నా నిలబెట్టుకోవాల్సిన భాద్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులను చూస్తుంటే తనకు తన కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయన్నారు. తాను కూడా సరదాగా గడిపానన్నారు. తనకు, 19 సంవత్సరాలకే పెళ్ళి చేశారని తన భర్త చంద్రబాబు తనపై నమ్మకంతో హెరిటేజ్ భాధ్యతలు అప్పగించారన్నారు. దీన్ని ఒక సవాల్‌గా తీసుకుని పనిచేశాను అని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు బాగాచదివి ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. ఆట పాటలేకాదు విద్యా ర్థులు కెరీర్‌పైన శ్రద్దపెట్టాలన్నారు. విజయం అనేది ఊరికేరాదు కష్టపడకుండా వచ్చేది ఏదీ నిలబడదు అన్నారు. ఎంత హార్డ్‌వర్కు చేస్తే అంత ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చునన్నారు. విద్యార్థి దశనుండి లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించ వచ్చును అన్నారు. తన కుమారుడు లోకేష్‌కు కూడా అదే చేప్పేదాన్ని అన్నారు.

**మహిళలదే అన్ని రంగాల్లో హవా :**

నేడు అన్ని రంగాల్లోనూ మహిళలదే హవా అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నలగాంపల్లిలో నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు మహిళలు ఇళ్లకే పరిమితం అయ్యేవారని తర్వాత పరిస్థితులు మారాయన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు ముందున్నారన్నారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు.ఐటీ రంగంలోనూ మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. కుప్పం అభివృద్ధి మా బాధ్యత అని చంద్రబాబు ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచన చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్,రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పియస్.మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు బాబునాయుడు,మాజీ ఎంపిపి మునిరాజు,నేతలు హేమాంబర్‌గౌడు, బేటప్పనాయుడు,యల్లప్ప, తహశీల్దారు శీతారాం,ఎంపిడిఓ రాధాకృష్ణ, నేతలు, కార్యకర్తలు, మహిళలు ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హాస్టల్స్ మరమ్మతులు జనవరి లోపు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, విద్య డిసెంబర్ 19 ప్రభాతవార్త: నగరంలోని ఐదు సాంఘీక సంక్షేమల హాస్టల్స్ లో మరమ్మతులు జనవరి నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి సంక్షేమ హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని హాస్టల్స్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం పరిశీలించారు. మొదటగా ఎస్సీ గర్ల్స్ హాస్టల్ ను పరిశీలించగా హాస్టల్ ఫ్లోరింగ్ పెచ్చులు ఊడి ఉండటాన్ని గమనించారు. అలాగే హాస్టల్‌లోని ఏ ఒక్క బాత్ రూం కు తలుపులు లేకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాల్ లోకి మూత్రవిసర్జన వాసన కొడుతుండటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వాడిన కూరగాయలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ తాజా కూరగాయలనే వాడాలని ఆయన ఆదేశించారు. హాస్టల్ లో అందుతున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని వార్డ్స్ ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహాచ్చారి,టిడిపి నాయకులు మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్,కేవి రమణ,ఆదిలక్ష్మీ,రాధిక, గణేష్, సుబ్రమణ్యం, నారమల్లి ప్రకాష్,జనసేన నాయకులు పనతల వెంకటేష్,విజయ్ రాయల్, కీర్తన,బాబ్జీ,కెఎంకె లోకేష్, ఆముదాల వెంకటేష్, సుబ్బారావు, కుమార్,రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

### అదానీ ఫౌండేషచే...

## రైతులకు జిప్సం, టార్పాలిన్ పంపిణీ




చిల్లకూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త: అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్‌లో భాగంగా అదానీ ఫౌండేషన్ ముత్తుకూరు మండలం, చిల్లకూరు మండల రైతులను ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌గా ఏర్పాటు చేయడానికి సౌకర్యాన్ని కల్పించిందన్నారు. కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఈరోజు 322 మంది సభ్యులతో పని చేస్తోంది. అదానీ ఫౌండేషన్ వ్యవసాయ ఇన్‌పుట్‌లను అందించడం ద్వారా వివిధ ప్రభుత్వాల ద్వారా ప్రయోజనం పొందడం ద్వారా కెఎఫ్‌పిసిఎల్ సభ్యులందరికీ మద్దతు ఇస్తుంది. బొల్లవోలు గ్రామంలో 100 మంది రైతులకు అదానీ ఫౌండేషన్ ద్వారా జిప్సం మరియు టార్పాలిన్‌లను సీనియర్ అగ్రికల్చర్ ప్రభుత్వ సమక్షంలో పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారులు అదానీ ఫౌండేషన్ అగ్రికల్చర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆర్ సెల్వరాజ్ రైతులకు సహజ వ్యవసాయ ఇన్‌పుట్‌ల తయారీ శిక్షణ ఇచ్చారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సతీష్, తిరుపతి, ప్రభుత్వం. జిప్సం, టార్పాలిన్ పంపిణీ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మాట్లాడుతూ 300 మందికి పైగా రైతులు తమ ఇన్‌పుట్ ఖర్చును తగ్గించడానికి మరియు వ్యవసాయ ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయ మద్దతును పొందుతున్నందున రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుకు అదానీ ఫౌండేషన్ యొక్క చొరవ ప్రశంసించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి దశరథ రెడ్డి తిరుపతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ ఉద్యానవన సంబంధిత ప్రభుత్వాలపై రైతులకు అవగాహన కల్పించారు. పథకాలు, మండల వ్యవసాయ అధికారి కార్తీక్ కూడా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కాగా కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ సి.హెచ్ వెంకటేష్ మాట్లాడుతూ అదానీ ఫౌండేషన్ మరియు అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ వేరుశెనగ, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తిని పెంచడానికి రైతులు తమ క్షేత్ర వ్యవసాయ మద్దతు వ్యవస్థ ద్వారా లబ్ధి పొందుతున్నామని చెప్పారు. 1000 మంది రైతులను కెఎఫ్‌పిసిఎల్‌లో సభ్యులుగా చేయాలని కెఎఫ్‌పిసిఎల్ లక్ష్యంగా పెట్టుకుందని కోశాధికారి షేక్ సఫీ తెలిపారు. అదానీ ఫౌండేషన్ యొక్క సిఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ సిఈఓ జగదీష్ పటేల్ నాయకత్వంలో మరియు అదానీ ఫౌండేషన్ యొక్క దక్షిణ ప్రాంత సిఎస్ఆర్ హెడ్ డాక్టర్ అనిల్ బాలకృష్ణన్ యొక్క మార్గదర్శ కత్వంలో, అదానీ ఫౌండేషన్. వివిధ సిఎస్ఆర్ ప్రాజెక్ట్‌లను అమలు చేస్తోంది, వీటిలో ప్రాజెక్ట్ అన్నపూర్ణ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. బొల్లవోలు గ్రామస్థులతో కలిసి అరుణ్ టి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

## చిత్తూరు స్మార్ట్ సిటీ లక్ష్యంగా ప్రతి అడుగు

- రోడ్ల విస్తరణలో స్థలాలు కొల్పోయే వారికి నష్టపరిహారంతో పాటు టిడిఆర్ బాండ్లు - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు

చిత్తూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరు తమ అడుగులను ముందు కేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు పిలుపునిచ్చారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో గురు వారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అధ్యక్షతన 'చిత్తూరు నగరంను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేద్దాం' అనే అంశంపై అన్ని వర్గాల నుండి సలహాలు, సూచనలు తీసుకునే కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహార్, ఆర్డీఓ శ్రీనివాసులు తదతరులు హాజర య్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం చిత్తూరు అభివృద్ధికి ఇక్కడి ప్రజల సహకారం ఎంతో అవసరం, రోడ్ల విస్తరణకు సంబంధించి స్థలాలు కొల్పోతున్న ప్రజల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భవనాలు కొల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని అడుగుతున్నారని, జిల్లాలో హైవేల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ నిర్మాణా లకు అత్యధిక రైతులు భూములు ఇచ్చారని వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడం జరిగిందన్నారు. ఎక్కడైనా అభివృద్ధి జరుగాలంటే భూమి కేటాయించాలని, మీకు కచ్చితంగా పరిహారంతో పాటు టిడిఆర్ బాండ్లు అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిడిఆర్ బాండ్లను ఎక్కడైనా అమ్ముకో వచ్చునని, రాజమహేంద్రవరం, ఇతర మున్సిపాల్టీల్లో టిడిఆర్ బాండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో హైవేలు ఏర్పాటు కావడంతో వాటి ప్రక్కన వున్న భూముల విలువ పెరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ చిత్తూరు నగరంను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి అన్ని వర్గాల ప్రజల సహకరించాలని పిలుపు నిచ్చారు. రోడ్లు వెడల్పు చేయడంతో భవనాలు, భూమి కొల్పోయిన వారందరికీ ఆమోదయోగ్యమైన విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చిత్తూరు నగర అభివృద్ధికి ఉపయోగపడే పనికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. టిడిఆర్ బాండ్లపై వున్న అపోహలను వదలివేయాలన్నారు. రోడ్డు విస్తరణలో పూర్తిగా భవనాలు కొల్పోయే వారి ఇళ్ళను మరోసారి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలి స్తారని, తాను స్వయంగా ఇళ్ళకు వచ్చి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. తన వ్యక్తిగత అవసరాల కోసం భూమి అడగటం లేదని, చిత్తూరు నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేతులు కలిపి ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. రోడ్ల విస్తరణలో ఇళ్ళు, స్థలాలు కొల్పోయిన వారి డిమాండ్‌ను సిఎం దృష్టికి తీసుకెళ్తా నని, పూర్తిగా ఇళ్ళు కొల్పోయే వారికి న్యాయం చేసేలా సిఎం దృష్టికి తీసుకెళ్ళి వారికి కొత్త ఇళ్ళు కట్టించేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, సంతపేట అభివృద్ధి కమిటీ నాయకులు, ప్రైవేటు సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున చిత్తూరు ప్రజలు పాల్గొన్నారు.



స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేద్దాం కార్యక్రమంలో కలెక్టర్,ఎమ్మెల్యే

### ఇద్దరు గంజాయి స్మగ్లర్లు అరెస్టు...

## 25 కేజీల గంజాయి స్వాధీనం

రేణిగుంట, డిసెంబర్19 ప్రభాతవార్త : రేణిగుంట అర్బన్ పోలీసులు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ శరత్ చంద్ర పర్యవేక్షణలో ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి వద్ద 2.5లక్షల రూపాయల విలువైన 25కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా అర్బన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు రేణిగుంట రమణ విలాస్ సర్కిల్ కోడూరు కు వెళ్లే రోడ్డు మార్గం వద్ద ఒక వృద్ధురాలు మరో యువకుడు అనుమానాస్పదంగా ప్లాస్టిక్ బ్యాగులతో కనిపించారు. పోలీసుల రాకను గుర్తించి ఇరువురు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు విచారణలో వారు రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన సక్కుబాయి (65), తిరుపతికి చెందిన చిరంజీవి (35)గా నిర్ధారించారు. ఈ సందర్భంగా సిఐ శరత్ చంద్ర మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణ చేసినా, అమ్మినా ఎంతటి వారైనా పోలీసుల నుండి తప్పించుకోలేరన్నారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లు

## అక్కను వేధిస్తున్న...అత్తపై తమ్ముడు దాడి!

### -చికిత్స పొందుతూ అత్త మృతి

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త : అక్కను వేధిస్తున్న అత్తపై తమ్ముడు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఈ నెల 18వ తేది బుధవారం బావ పురుషోత్తం (34) అక్క నాగలక్ష్మి (30)తో గొడవ పడ్డాడు. దానికి ప్రధాన కారణం తన బావకు తల్లియైన నూకసాని ద్రాక్షాయణి (50) అని తమ్ముడైన జి. విజయ్ (28) భావించాడు. ద్రాక్షాయణి తరచూ తన అక్కకు, బావకు గొడవ పెడుతుందని అలాగే తన బావ, అక్కకు గొడవ పెట్టిందని ఆమెపై కోపంతో విజయ్ టెంకాయలు నరికే కత్తి తీసుకుని వెళ్లి ద్రాక్షాయణి తన వీధులోని మదు అనే అతని ఇంటి నుండి మెట్లు దిగుతుండగా విజయ్ ఆమె తలపైన విచక్షణారహితంగా నరకగా తల చీలి రక్త గాయాలైయ్యాయి. ఎడమ చేయిపై నరకగా తీవ్రమైన రక్త గాయాలైయ్యాయి. వెంటనే గాయపడిన నూకసాని ద్రాక్షాయణిని చికిత్స నిమిత్తం ఎస్‌విఆర్‌ఆర్‌జిజి హాస్పిటల్‌కు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ద్రాక్షాయిణిని శ్రీ రమాదేవి హాసుపత్రికి తరలించగా ఆమె గురువారం తెల్లవారుజామున గాయాల నుండి కోలుకోలేక మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు అలిపిరి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



